క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఐరాల విద్యార్థులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కోమల

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వంశీకృష్ణ, హేమలత జాతీయస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు సోమవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల అనంతపురం జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలబాలికల సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిద్దరూ ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్ర ఔరంగాబాద్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, కార్యదర్శి, రమేష్, పీడీ దేవా అభినందనలు తెలియజేశారు.

చంద్రప్రభ వాహనంపై కరకంతేశ్వరుడు

నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కరకంతేశ్వర స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చిన స్వామివారిని భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంతర్జాతీయ నైపుణ్య శిక్షణకు విశేష స్పందన


శిక్షణ ఇస్తున్న శిక్షకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో మెడికల్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ మోసోబి నేతృత్వంలో లండన్‌లో పనిచేయాలనుకునే వైద్య, పారామెడికల్ విద్యార్థులకు ఆ దేశం నిర్వహించే యూకేఎంఎల్‌ఏ, పీఎల్‌బీఏ పరీక్షకు ఎలా సిద్ధం అవ్వాలని అంశంపై నిపుణులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ శిక్షణకు దేశ నలుమూలల నుంచి 3 వేలకు పైగా వైద్యులు హాజరవడం విశేషం.

రాష్ట్ర సరిహద్దులో పక్కాగా నిఘా


చెక్‌పోస్ట్ వద్ద డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

గుడిపాల: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో నిఘాను పక్కాగా నిర్వహించాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో సోమవారం రాత్రి మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడంతో నంగమంగళం, గొల్లమడుగు వద్ద చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో నిఘా పటిష్టంగా నిర్వహించాలన్నారు. తమిళనాడులో ఏప్రిల్ 19న, ఆంధ్రలో మే 13న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయనతో పాటు గుడిపాల ఎస్‌ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

ఇంటివద్దకే మెరుగైన వైద్యసేవలు


వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకూ వెళ్లి, ప్రతి రోగికి వైద్యసేవలు అందజేయనున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. పానాటూరు గ్రామంలో సోమవారం 104 వైద్య సేవలను గ్రామంలో అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిటకు వైద్య సేవలను అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు. అనంతరం 67 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామంలో మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రియాంక, శాంతకుమారి, యమున, మణిమేఘల భారతి పాల్గొన్నారు.

బ్యానర్లు తొలగించండి

- చిత్తూరు నియోజకవర్గ ఎన్నికల అధికారులకు సూచనలు
- చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న చిత్తూరు ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, పక్కన కమిషనర్ అరుణ, హాజరైన చిత్తూరు నియోజకవర్గం అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే పలు చోట్ల రాజకీయ పార్టీల బ్యానరుల, పోస్టర్లు తొలగించారని, ఇంకా ఎక్కడైనా ఉంటే వెంటనే తొలగించాలని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బృందంతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రైవేట్ స్థలాల్లో ఎక్కడైనా రాజకీయపార్టీల బ్యానర్లుంటే 24 గంటల్లోగా తొలగించాలన్నారు. వారికి ముందస్తుగా నోటీసులు పంపాలని చెప్పారు. సచివాలయ పరిధిలో పనిచేసే ఉద్యోగులెవ్వరూ రాజకీయ పార్టీల సమావేశాలకు, ప్రచారాలకు వెళ్లకూడదన్నారు. వలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారాలకు, సమావేశాలకు వెళ్లకూడదన్న అంశాన్ని సచివాలయ పరిధిలో సమావేశం నిర్వహించి తెలియజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, సెక్టోరల్ అధికారి, బీఎల్‌ఓ, స్థానిక ఎస్‌ఐ ఫోన్ నెంబర్, పోలింగ్ కేంద్రం, నియోజకవర్గం నెంబర్ ఉండేలా గోడపై పెయింట్‌తో రాయించాలని తెలిపారు. ఈపనులన్నీ రెండురోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా మద్యం, డబ్బులు పంపిణీ చేస్తుంటే సంబంధిత సభ్యులకు తెలియజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

చిత్తూరు నియోజకవర్గం ఆదర్శంగా ఉండాలి

ఎన్నికల నిర్వహణలో చిత్తూరు నియోజకవర్గం ఆదర్శంగా ఉండాలని చిత్తూరు ఆర్‌వో, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. లా అండ్ ఆర్డర్, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల బృందాలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏర్పాటు చేసిన వివిధ రకాల బృందాలు రోజు వారీ నివేదికలను రోజుకు రెండు సార్లు నియోజకవర్గ నోడల్ అధికారికి ఇవ్వాలన్నారు. చిత్తూరు నియోజకవర్గ శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించి చిత్తూరు డీఎస్పీతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే ముందు డీఎస్పీ నుంచి అనుమతి పొందాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి ప్రింటింగ్ ప్రెస్‌లో కరపత్రాలు, పోస్టర్లు ప్రింటింగ్ చేస్తే సంబంధిత ప్రింటర్ పేరు, ఎన్ని కాపీలు వేస్తున్నారనే పూర్తి వివరాల రిపోర్టు పంపించాలని ఆదేశించారు. ఎక్కడైనా మద్యం, డబ్బులు సీజ్ చేసిన వెంటనే ముందుగా సంబంధిత పోలీసు స్టేషన్‌లో అందజేయాలని తెలిపారు. ఈ సమావేశాల్లో డీఆర్‌ఓ పుల్లయ్య, చిత్తూరు ఏఆర్‌ఓ, నగర పాలక కమిషనర్ అరుణ, చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను తొలగించండి

పూతలపట్టు: రాజకీయ పార్టీలను తొలగించాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. మండలంలోని బూసిపల్లిలో సోమవారం పర్యటించిన ఆమె గ్రామశివారులోని రాజకీయ పార్టీల పోస్టర్లను గమనించారు. వాటిని వెంటనే తొలగించాలని సచివాలయాల సిబ్బందికి ఆదేశించారు. రాజకీయ నాయకుల విగ్రహాల మూసివేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎన్‌సీసీకి విరుద్ధంగా నడచుకోకూడదని తెలిపారు. అనంతరం బూసిపల్లిలోని ఎంపీపీ పాఠశాలను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరంగా భోజనం అందించాలని టీచర్లను ఆదేశించారు. వీరి వెంట సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ప్రసన్నకుమారి

ప్రశాంతంగా పది పరీక్షలు


బంగారుపాళెం: ప్రభుత్వ ఉన్నత పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఐరాల: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐరాల మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు 357 మందికి గాను 354 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ దామోదర్‌నాయుడు తెలిపారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 134 మందికి గాను 132, ఎం.పైపల్లెలో 121కి గాను 120 మంది, కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో 102కు గాను అందరూ పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పకడ్బందీగా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఎస్‌ఐ రమేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు.

ఐదుగురు గైర్హాజరు

తవణంపల్లె: మండలంలోని తవణంపల్లె హైస్కూల్లో ముగ్గురు, అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ హేమలత తెలిపారు.

47 మంది గైర్హాజరు

బంగారుపాళెం: మండలంలో 10 తరగతి పరీక్షల కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, డెస్కులు వంటి సదుపాయాలను కల్పించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు గంటకు ముందే చేరుకున్నారు. మొత్తం 827 మంది విద్యార్థులకు గాను 780 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 47 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.


ఐరాల: పరీక్ష కేంద్రాలకు వెళుతున్న విద్యార్థులు

వంద శాతం హాజరు

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏ, బీ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 460 మంది విద్యార్థులకు గానూ అందరు పరీక్షలకు హాజరై వందశాతం నమోదు చేశారు. చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

వర్క్ఆర్డర్లను క్లోజ్ చేయండి


మాట్లాడుతున్న ఈఈ పద్మనాభ పిళ్లై

చిత్తూరు కార్పొరేషన్: పెండింగ్‌లో ఉన్న వర్క్ఆర్డర్లను ఈనెల లోపు క్లోజ్ చేయాలని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఈఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మార్చిలోపు వివరాలను ఇవ్వకపోతే ఏఈల జీతాల నుంచి రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. సెక్షన్లవారీగా వ్యవసాయ, గృహ సర్వీసుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. వంద శాతం బిల్లు కలెక్ట్ చేసే విధంగా కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రైవేటు సర్వీసులకు సరఫరా ఆపివేయాలన్నారు. పది పరీక్ష కేంద్రాలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. వేసవిలో అంతరాయాలు లేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈ, సబ్‌ఇంజినీర్లు పాల్గొన్నారు.

మారుమూల గ్రామీణులకు ప్రభుత్వ వైద్యం


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పల్లె ముంగిటకే మెరుగైన వైద్యసేవలు ప్రభుత్వం అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు, మజ్జిగ, నీరు అధికంగా తీసుకోవాలన్నారు. వృద్ధులు ఎండవేళ ఇంటి పట్టునే ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరునికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని బీఆర్‌ఎస్ కండ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై వెలసిన శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో కొండమల్లీశ్వర స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని సర్వాంగ సుందరంగా, విశేష అలంకరణతో కొండమల్లీశ్వర స్వామిని ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో మొదలయ్యాయి. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసచార్యులు ధ్వజారోహణ పూజలు చేశారు. శ్రీవారి మూలవిరాట్ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలికల ఉన్నత విద్యకు ఊపిరి


మంత్రి రోజాకు కళాశాల పరిస్థితిని వివరిస్తున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు (ఫైల్)

నగరి : జూనియర్ కళాశాలలో కోఎడ్యుకేషన్ మాత్రమే ఉండడంతో బాలికలకు విడిగా జూనియర్ కళాశాల ఉంటే వారి అభివృద్ధికి తోడ్పడుతుందని అందుకు అవసరమైన విరాళం తామిస్తామంటూ 20 ఏళ్ల క్రితం మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడకు చెందిన ఎంఎస్.మురుగానందం నాగమ్మాళ్ దంపతులు ముందుకు వచ్చి కళాశాల కోసం రూ.20 లక్షలు విరాళమిచ్చారు. దీంతో 16 ఏళ్ల క్రితం అప్పటి పాలకులు ఎంఎస్‌ఎంఎస్ బాలికల జూనికర్ కళాశాల పేరుతో ఎస్‌జీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలోనే రెండు గదుల్లో తూతూమంత్రంగా ప్రారంభించి మమ అనిపించారు. కళాశాలకు అవసరమైన భవనంగానీ, సిబ్బంది నియామకం గానీ చేపట్టలేదు. ఆసక్తి లేకుండా ప్రారంభించిన ఈ కళాశాలకు ఆది నుంచి కష్టాలు తప్పలేదు. తొలుత 67 మంది విద్యార్థినులు మాత్రమే చేరారు. చేరిన వారుకూడా ఎందుకు చేరామా ? అని బాధపడే పరిస్థితి ఎదురైంది. ఆ దశలో గత ప్రభుత్వం నిర్వహించిన నీరుచెట్టులో అక్రమాలను బయట పెట్టడానికి కళాశాలకు వెళ్లిన మంత్రి ఆర్కే రోజాకు విద్యార్థినులు తమ బాధను వివరించారు. తమకు విడిగా బాత్రూమ్‌లు లేవని విన్నవించారు.

అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా..

విద్యార్థుల సమస్యలపై స్పందించిన మంత్రి రోజా నిరుపయోగంగా ఉన్న ఆస్పత్రి భవనాన్ని నవీకరించి బాలికల జూనియర్ కళాశాలకు ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే అప్పటి పాలక ప్రభుత్వం అయిన టీడీపీ అడుగడుగునా ఆ పనులకు అడ్డుపడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేసులు కూడా పెట్టారు. అయితే దేనికీ బెదరని మంత్రి ఆర్కేరోజా తాను అనుకున్న పని పూర్తిచేశారు. నిరుపయోగ ఆస్పత్రి భవనాన్ని బాలికల జూనియర్ కళాశాలకు అందించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పక అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10 లక్షల నిధులతో రెస్ట్‌రూమ్‌లు కట్టించారు. చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి శుద్ధీకరించిన తాగునీటిని అందించారు. 67 మంది మాత్రమే ఉన్న కళాశాలలో నేడు 350 మంది బాలికలు అభ్యసించే స్థాయికి తీసుకువచ్చారు. అయితే పర్మనెంట్ పోస్టుల మంజూరు లేకపోతే విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని ప్రిన్సిపల్, అధ్యాపకులు మంత్రి రోజాకు విన్నవించుకున్నారు. ఆమె కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఫలితంగా 7 పర్మినెంట్ అధ్యాపక, టైపిస్టు, రికార్డు అసిస్టెంట్, అటెండర్ పోస్టులను నగరి బాలికల జూనియర్ కళాశాలకు కేటాయించారు. ఈ మేరకు ఈ నెల 16వ తేదీన ప్రభుత్వం నుంచి కళాశాలకు ఉత్తర్వులు అందాయి. కళాశాల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిన దశలో మంత్రి ఆర్కేరోజా ఊపిరి పోశారని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. 350 మంది విద్యార్థుల భవిష్యత్‌కు బాట వేశారని, ఇంతటి కృషిచేసిన మంత్రికి కళాశాల తరపున ధన్యవాదాలు అన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నియమావళిని పాటించాలని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలోని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ప్రచార కార్యక్రమాలు, బహిరంగ సభలు నిర్వహించినప్పుడు ఆర్వో నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాలను ప్రచారాలకు వాడరాదని తెలిపారు. బహిరంగ సభలను నిర్వహించే ముందు ఆర్వో చేత అనుమతి, వాటికి అయ్యే ఖర్చు వివరాలను తెలియపరచాలని చెప్పారు. ప్రచార సమయాల్లో ఓటర్లకు నగదు, వస్తువు రూపంలో ఎలాంటి బహుమానాలు అందించకూడదని తెలిపారు. వీలైనంత వరకు ఒక వ్యక్తి రూ.50,000కు మించిన నగదుతో ప్రచారాల్లో పాల్గొనకూడదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, రీసర్వే డీటీ మునికృష్ణా, నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పుత్తూరు: చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు వంటి పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య తెలిపారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కాపు వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శరీరంలో పోషక లోపం రాకుండా తల్లులతో పాటు పిల్లలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు మెండుగా ఉన్నాయని తెలిపారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వంట సమయంలో కూరగాయలను నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో ఒక ఆకుకూర ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపిద్దాం


వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్న అక్కచెల్లెమ్మలు

పూతలపట్టు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి, మళ్లీ మన సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం సాయంత్రం మండలంలోని సంజీవరాయనిపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తొలుత గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామికి పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం రూ.3 లక్షల వరకు లబ్ధిపొందిందని వివరించారు. త్వరలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేనిఫెస్టోను విడుదల చేయనున్నారని, అందులో మరింత లబ్ధిని పేదలకు అందించనున్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండేవారని జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దకే పథకాలు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. ఈసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, ఎంపీపీ కుమారి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, ఎల్బీఐ లోకేష్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, సర్పంచులు అమర్‌నాథరెడ్డి, ఎంఎస్ మణి, మాసిలామణి, సుబ్రమణ్యం, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, పట్టాభిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు జయచంద్రారెడ్డి, దొరస్వామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.